హంద్రీనీవాపై రోడ్డు వేస్తున్నా కన్పించలేదా..?

- కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి
- నీటిపారుదల, నేషనల్ హైవే అధికారులపై విచారణ జరపాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

హంద్రీనీవా కాలువపై వేసిన రోడ్డు చిత్రాలను చూపుతున్న రాంభూపాల్, నల్లప్ప

అనంతపురం నుంచి విజయవాడ వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనుల్లో భాగంగా కర్నూలు జిల్లా గార్గేయపురం-బ్రాహ్మణ కొట్కూరు మధ్య హంద్రీనీవాను పూడ్చి కాలువలో నీరు రాకుండా తారు రోడ్డు వేస్తున్నా అధికారులకు కన్పించలేదాని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ ప్రశ్నించారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్పతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎగువ కర్ణాటకలో కురిసిన భారీ వర్షాల వల్ల తుంగభద్ర డ్యామ్ అన్ని గేట్లు ఎత్తారన్నారు. ఇటు శ్రీశైలం ప్రాజెక్టు పది గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారని తెలిపారు. శ్రీశైలం డ్యామ్‌లో నీరు పొంగిపొర్లుతున్నా బ్యాక్‌వాటర్‌పై ఆధారపడిన హంద్రీనీవా కాలువకు నీరు విడుదల చేయలేదన్నారు. హంద్రీనీవా నీటిపై ఆధారపడిన అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు జిల్లాలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఒకవైపు వర్షాలు సకాలంలో రాకపోవడంతో రాయలసీమ జిల్లాల్లో సాగు బాగా తగ్గిపోయిందన్నారు. అనంతపురం జిల్లాలో జూలైలో సుమారు 64 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా కేవలం 17.2 మిల్లీమీటర్లు మాత్రమే కురిసిందన్నారు. ఈ ఖరీఫ్‌లో 3.46 లక్షల హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా, 80 వేల హెక్టార్లలో మాత్రమే రైతులు విత్తనాలు వేశారన్నారు. గత సంవత్సరంతో పాటు ఈ సంవత్సరం కూడా తీవ్ర కరువు ఏర్పడిందన్నారు. ఇలాంటి స్థితిలో తుంగభద్ర డ్యామ్ నుంచి కిందకు నీరు వచ్చి చెరువులు, కుంటలు నిండుతాయని ఆశించిన రైతాంగంపై కాంట్రాక్టర్ నీళ్లు చల్లారన్నారు. విజయవాడ జాతీయ రహదారి పనుల పేరుతో కర్నూలు జిల్లాలో హంద్రీనీవా కాలువను పూడ్చి కాలువలో తారు రోడ్డు వేసి నీటి విడుదలను కాంట్రాక్టర్ అడ్డుకోవడం అత్యంత దారుణం అన్నారు. రాయలసీమ జిల్లాలకు రావాల్సిన నీటిని రాకుండా ఇంతటి దుశ్చర్యకు పాల్పడుతుంటే హంద్రీనీవా అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. కాలువ నీటి కోసం మోటార్లు వేసుకున్న రైతులపై కేసులు పెట్టి, అపరాధ రుసుం వసూళ్లు చేసే నీటిపారుదల అధికారులు కాంట్రాక్టర్ కాలువనే పూడ్చి తారు రోడ్డు వేస్తుంటే ఎందుకు క్రిమినల్ కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. హంద్రీనీవా నీరు రాకుండా అడ్డుకున్న కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు పెట్టి, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హంద్రీనీవా అధికారులు, కాలువను పూడ్చినా చూస్తూండిపోయిన నేషనల్ హైవే అధికారులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితుల దృష్ట్యా తక్షణం నీటి విడుదలకు చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు.

గుండుమల గ్రామంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు, టిడిపి శ్రేణులు

ప్రజావేదిక కార్యక్రమంలో ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు

ప్రజలందరి

సంక్షేమమే ధ్యేయం

- 'వక్క'కు మార్కెటింగ్ కల్పిస్తాం
- మడకశిరలో హంద్రీనీవా కింద రెండు రిజర్వాయర్లు
- పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు
- గుండుమలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, మడకశిర

రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలియజేశారు. గురువారం నాడు శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం గుండుమల గ్రామంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదును పంపిణీ చేశారు. నంద్యాల జిల్లా పర్యటన ముగించుకుని శ్రీశైలం సున్నిపెంట నుంచి ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో మధ్యాహ్నం 3.45 గంటలకు గుండుమల ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన గుండుమల గ్రామానికి వెళ్లారు. 4 గంటలకు గుండుమలలో ఓబులమ్మ ఇంటి వద్దకు చేరుకుని వితంతు పింఛను పంపిణీ చేశారు. పులమాసి రామన్న ఇంటి వద్దకెళ్లి వద్ధాప్య పింఛన్ అందించారు. అనంతరం మల్బరీ ప్లాంటేషన్ షెడ్‌ను సందర్శించి పట్టు రైతుతో మాట్లాడారు. అక్కడి నుంచి గుండుమలలో వడిసలమ్మ, కరియమ్మ దేవి దేవాలయాలను సందర్శించారు. అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. పింఛన్‌దారుల ఇంటికెళ్లి వారి కష్టాలు విన్న ముఖ్యమంత్రి రామన్నకు భూమితో పాటు, వారి బిడ్డలకు ఉపాధి కల్పిస్తామని, ఓబుళమ్మకు ఇల్లు కట్టించి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్ చేతన్‌కు ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ముఖ్యమంత్రిగా తొలిసారి జిల్లాకు వచ్చిన చంద్రబాబుకు గుండుమలలో కార్యకర్తలు, అభిమానులు, మహిళలు ఘనస్వాగతం పలికారు. ముఖ్యమంత్రి పర్యటన అంతా వర్షం నడుమే సాగింది.

ఓబుళమ్మకు వితంతు పింఛను అందిస్తున్న చంద్రబాబు

పట్టు రైతుల సమస్యలపై ఆరా

చంద్రబాబు నాయుడు పట్టు రైతు రంగనాథతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పట్టు రైతులు, రీలర్లకు అంతకు మునుపు ఇచ్చే సబ్సిడీ గడిచిన ఐదేళ్లుగా ఇవ్వలేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి రైతు తీసుకొచ్చారు. మల్బరీ షెడ్డు నిర్మాణానికి కొన్ని నిబంధనలు ఇబ్బందికరంగా ఉన్నాయని, వాటిని మార్చాలని హిందూపురం ఎంపి బికె.పార్థసారధి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం వక్క రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా వక్క పంట ఇక్కడ ఉందని, అయితే మార్కెటింగ్ సౌకర్యం స్థానికంగా లేదని వక్క రైతులు ఆయనకు తెలియజేశారు. మార్కెటింగ్ సౌకర్యంతోపాటు, డ్రిప్ సబ్సిడీతో అందివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, హిందూపూర్ ఎంపీ బికె.పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, కలెక్టర్ టిఎస్.చేతన్, సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్, పుట్టపర్తి ఆర్డీవో సౌభాగ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు మడకశిర పర్యటనకు వస్తున్న సందర్భంగా ఆయనకు స్వాగతం పలికేందుకు ఎయిర్‌పోర్టు వద్ద వేచి ఉన్న ఉమ్మడి జిల్లా టిడిపి ఎమ్మెల్యేలు, ఎంపీలు, తెలుగుదేశం పార్టీ నాయకులు

వర్షంలో ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు

మడకశిరకు పలు హామీలు

సత్యసాయి జిల్లా తొలి పర్యటనలో మడకశిర ప్రాంతానికి చంద్రబాబు హామీల వర్షం కురిపించారు. ఎఫ్‌పిఒల ద్వారా వక్క రైతులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా కింద మడకశిర ప్రాంతంలో రెండు రిజర్వాయర్లు నిర్మిస్తామని తెలిపారు. రాళ్ల అనంతపురం వద్ద 1600 ఎకరాల సేకరించిన భూమిలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ ప్రాంతాన్ని పారిశ్రామిక క్లస్టర్‌గా ఏర్పాటు చేస్తామన్నారు. వక్క, పట్టు రైతులను ఆదుకుంటామని హామీనిచ్చారు. మడకశిర ప్రాంతంలో కర్నాటక హిరియుర్ నుంచి పెనుకొండ మీదుగా పుట్టపర్తికి కలిపే జాతీయ రహదారి ఏర్పాటుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. అత్యల్ప వర్షపాతం కలిగిన అనంతపురం జిల్లాకు హంద్రీనీవా ద్వారా సాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

గుంతకల్లు ఆర్డీవో కార్యాలయానికి గుర్తింపు

ఐఎస్‌ఓ 9001:2015 సర్టిఫికెట్

అనంతపురం : గుంతకల్లు ఆర్డీవో కార్యాలయానికి ప్రత్యేక గుర్తింపు లభించింది. జిల్లాలో ఐఎస్‌ఓ 9001:2015 సర్టిఫికెట్‌ను పొందిన మొదటి ప్రభుత్వ కార్యాలయంగా గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయం నిలిచింది. ఈ సర్టిఫికెట్ పొందాలంటే 39 రకాల ప్రమాణాలను పాటించాల్సి ఉండగా, అన్నింటినీ కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ మార్గనిర్దేశంలో గుంతకల్లు ఆర్డీవో వి.శ్రీనివాసులు రెడ్డి సిద్ధం చేసి ఐఎస్‌ఓ 9001:2015 సర్టిఫికేట్ కోసం దరఖాస్తు చేశారు. ఐఎస్‌ఓ ప్రతినిధులు వచ్చి అన్ని రకాల ప్రమాణాలు ఉన్నాయని ధ్రువీకరించి ఐఎస్‌ఓ 9001:2015 సర్టిఫికెట్‌ను జూలై 30వ తేదీ జారీ చేశారు. ఈ సర్టిఫికెట్‌ను గుంతకల్లు ఆర్డీవో కార్యాలయానికి హైదరాబాద్ గ్లోబల్ మేనేజ్మెంట్ సర్టిఫికేషన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు అందజేశారు. ఈ సర్టిఫికెట్ పొందిన మొదటి ప్రభుత్వ కార్యాలయంగా జిల్లాలో గుంతకల్లు ఆర్డీవో కార్యాలయం నిలిచింది. ఉరవకొండ నియోజకవర్గం, కూడేరు మండలంలోని అంతరగంగ గ్రామంలో గురువారం నాడు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌తో కలిసి అందజేసిన గుంతకల్లు ఆర్డీవోకు అందించారు. ఈ సందర్భంగా గుంతకల్లు ఆర్డీవో వి.శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ గుంతకల్లు రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఐఎస్‌ఓ 9001:2015 సర్టిఫికెట్ అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సర్టిఫికెట్ పొందడంలో కలెక్టర్ సూచనలు, సహకారం చాలా ఉందన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు

తలుపు తట్టి పింఛన్ ఇస్తున్నాం..!

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల ఇచ్చిన హామీ మేరకు 1వ తేదీ రాగానే వేకువజామున 6గంటలకే తలుపు తట్టి లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్నామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలియజేశారు. గురువారం ఉదయం 6 గంటల నుంచే నగరంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అరవింద్ నగర్, ఆదర్శ నగర్, హమాలీ కాలనీ, హౌసింగ్ బోర్డ్ కాలనీ, బుడ్డప్ప నగర్, సంగమేష్ నగర్, సూర్య నగర్, కమలానగర్, డిసిఎంఎస్ రోడ్డు ప్రాంతాల్లో ఎమ్మెల్యే నేరుగా లబ్ధిదారులకు పింఛన్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి రోజే రికార్డ్ స్థాయిలో పింఛన్లు పంపిణీ చేశామని చెప్పారు. మొదటి ఐదు సంతకాల హామీలలో ప్రతి ఒక్కటి నెరవేస్తున్నామని తెలిపారు.

రాయదుర్గం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కూడా గడవకముందే మాజీ సిఎం జగన్ తన సొంత పత్రికలో ప్రభుత్వంపై విష ప్రచారం చేయడం అతని వక్రబుద్ధి మారలేదనడానికి నిదర్శ నమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఎమ్మెల్యే గురువారం ఉదయం పట్టణంలోని మొదటి ఎన్నికల వార్డు పార్వతినగర్‌లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 65 లక్షల మంది పింఛనుదారులకు ప్రతినెలా రూ. 2,700 కోట్లు అందజేస్తున్నామన్నారు. రూ. 2వేల పింఛను మొత్తాన్ని రూ. 3వేలు చేసేందుకు జగన్ ఐదేళ్లు తీసుకోగా సిఎం చంద్రబాబు మొదటి నెల నుంచే ఒకేసారి రూ. 1000 పెంచి రూ. 4వేలు ఇస్తున్నారని తెలిపారు. జగన్ రాష్ట్ర ప్రజలను మోసం చేయడం వల్లే గత ఎన్నికల్లో అతడు ఘోర పరాభవం చూశాడన్నారు. త్వరలో వైసిపి కనుమరుగు కావడం ఖాయం అని, కూటమి ప్రభుత్వానికి మరో 20 ఏళ్లు ఢోకా ఉండదని కాలవ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, కమిషనర్ కిషోర్, కౌన్సిలర్లు నాగవేణి, టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, టంకశాల హనుమంతు, పురుషోత్తం, నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి కరేగౌడ్, మంజునాథ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. కంబదూరు మండలంలోని అండేపల్లి గ్రామంలో ఎమ్మెల్యే గురువారం స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పింఛనుదారులకు పింఛను మొత్తం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు కూట మి ప్రభుత్వం మొదటి నెల నుంచే ప్రతి నెలా 1వ తేదీనే పింఛను మొత్తం రూ. 4వేలు అందజేస్తుంద న్నారు. ఈ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్ర మంలో టిడిపి మండల కన్వీనర్ శివన్న, నాయకులు కరణం రామ్మోహన్ చౌదరి, లక్ష్మీనారాయణ, దండ వెంకటేశులు, శ్రీరాములు, కొత్తపల్లి తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కెపిఎల్ క్రికెట్ టోర్నీ జట్లకు జెర్సీలు పంపిణీ

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభంకానున్న కెపిఎల్ టోర్నీ జట్లకు పట్టణంలోని ప్రజావేదిక వద్ద జెర్సీలు పంపిణీ చేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగంలో రాణించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆ దిశగా యువత ముందుకు సాగుతూ సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, మున్సిపల్ మాజీ ఛైర్మన్ వైపి.రమేష్, లక్ష్మీనారాయణ, గోళ్ల వెంకటేశులు, డిష్ మురళి, గోళ్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులపై అధికారి శీతకన్ను

నగరంలో జరుగుతున్న మురుగు కాలువ పూడికతీత పనులు

- వర్క్ ఆర్డర్ల అగ్రిమెంట్లు లేకుండానే పనులు
- సంతకాలు చేయడానికి తీరికలేని అధికారి
- బదిలీపై వెళ్లిన అనంతరం పాతఫైళ్లపై సంతకాలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నివారించటానికి వంకల పూడికతీత పనులను ఇటీవల చేపట్టారు. ఇందుకు సంబంధించి రూ.52లక్షల నిధులను మంజూరు చేశారు. అయితే ఈ పనులకు సంబంధించి వర్క్ ఆర్డర్ అగ్రిమెంటు జారీ చేయకుండా గత కమిషనర్ నిర్లక్ష్యం చేయడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. సాధారణంగా కార్పొరేషన్ పరిధిలో ఏ పని అయినా వర్క్ ఆర్డర్లు అగ్రిమెంట్లు చేసుకోవాల్సి ఉంటుంది. అవేవీ లేకుండా పూడికతీత పనులు జరుగుతున్నాయి. గతంలో అప్పటి ధర్మవరం ఎమ్మెల్యేకు సంబంధించి అనంతపురం నగరంలోని ఆయన స్వగృహం ముందు వర్క్ ఆర్డర్లు అగ్రిమెంట్లు లేకుండానే సిమెంటు రోడ్డు పనులు చేశారు. దీంతో ఈ పనులకు సంబంధించి బిల్లుల మంజూరుకు ఐదు సంవత్సరాలకు పైగా సమయం పట్టింది. అప్పటి ఇంజినీరింగ్ అధికారుల అత్యుత్సాహం, కాంట్రాక్టర్ల పాలిట శాపంగా మారింది. ప్రస్తుతం పూడికతీత పనుల్లోనూ ఇలాంటి పరిస్థితే కన్పిస్తోంది. పూడికతీత పనులకు సంబంధించి వర్క్ ఆర్డర్లు, అగ్రిమెంట్లు ఇంకా జారీ కాలేదు. ఇవేవీ లేకుండానే పనులు చేయడం వల్ల కాంట్రాక్టర్లు ఇబ్బందుల పాలయ్యే అవకాశం ఉంది.

నగరంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నివారించడానికి వంకల పూడికతీత పనులు చేపట్టాలని నెలన్నర క్రితం కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. మరువ వంక, నడిమి వంక, జనశక్తి నగర్ ప్రాంతాల్లో పర్యటించి పూడికతీత పనులు చేపట్టాలని అప్పటి కమిషనర్ మేఘస్వరూప్‌ను ఆదేశించారు. కలెక్టర్ చెప్పినా అప్పటి కమిషనర్‌కు ప్రజారోగ్యానికి అవసరమైన పనులు చేపట్టాలన్న ఆలోచన రాకపోవటం శోచనీయం. కనీసం టెండర్లు ఖరారు అయిన తర్వాత అయినా పూడికతీత పనులకు సంబంధించి వర్క్ ఆర్డర్లు అగ్రిమెంట్లు చేయలేదు. ఇటీవల కమిషనర్ మేఘస్వరూప్ బదిలీపై వెళ్లారు. బదిలీపై వెళ్లి అనంతపురానికి వచ్చిన సందర్భంగా పెండింగ్ ఫైళ్లపై సంతకాలు పెట్టించుకునేందుకు కాంట్రాక్టర్లు ఆయన వద్దకు క్యూకట్టారు. మూడు నెలల కాలానికి సంబంధించిన ఫైళ్లను తన లాగిన్‌లోనే ఉంచుకున్న కమిషనర్ వాటిని పూర్తి చేసి కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకు ఆసక్తి చూపారు. అయితే ప్రజారోగ్యానికి సంబంధించిన ఫైళ్లపై సంతకాలు చేయడానికి మాత్రం తీరిక లేకుండా పోయింది. వర్షాకాలం కావడంతో నగరంలోని ప్రధాన వంకల పూడికతీత పనులపై ప్రస్తుత కమిషనర్ పివివిఎస్.మూర్తి దృష్టి సారించారు. ఈ పనులను పూర్తి చేయించేలా ఆయన పని చేస్తున్నారు. ప్రజా అవసరాల దృష్ట్యా పూడికతీత పనులు చేయించడం మంచిదే అయినా నిబంధనల మేరకు వర్క్ ఆర్డర్లు, అగ్రిమెంట్లను పూర్తి చేసి వీటిని నిర్వహిస్తే అందరికీ ఉపయోగంగా ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

భావన స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

నేడు సిపిఎం ఆధ్వర్యంలో పాఠశాల ముట్టడి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని భావన స్కూల్ యాజమాన్యం నిబంధనలను తుంగలో తొక్కి విద్యార్థుల ప్రాణా లతో చెలగాటం ఆడుతోందని, తక్షణమే ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. భావన స్కూల్ మినీ బస్సులో నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తుండగా గురువారం సిపిఎం నాయకులు గుర్తించి స్థానిక శాంతినగర్ వద్ద బస్సును ఆపి బస్సు ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ మినీ బస్సులో సంఖ్యకు మించి విద్యార్థులను తరలించడం ద్వారా ఏదైనా జరిగితే బాధ్యు లెవరని ప్రశ్నించారు. ఇదే విషయంపై ఎంఇఒ నాగమణికి ఫోన్ ద్వారా సమాచారం తెలిపగా ఆమె పొంతన లేని సమాధానం చెప్పడాన్ని తీవ్రంగా ఖండించారు. అలాగే ఆర్టీవోకు సమాచారం తెలిపి తక్షణమే పాఠశాల బస్సులై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు నాయకులు తెలిపారు. దీనికితోడు నిర్మాణంలో ఉన్న గదుల్లో తరగతులు నిర్వహించడానికి జిల్లా విద్యాశాఖ అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ప్రస్తుతం భావన స్కూల్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు లేకపోవడంతో పట్టణానికి దూరంగా ఉన్న రాయల్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నా మండల, జిల్లా విద్యాశాఖ అధికారు లకు పట్టదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న భావన స్కూల్‌ను శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో ముట్టడిస్తున్నట్లు తెలిపారు. ధర్నాలో సిపిఎం నాయకులు మధు, తిమ్మరాజు, ఓబులేష్, అంజి, తిప్పేస్వామి, నాగేంద్ర, రామంజి, నాగ పాల్గొన్నారు.

ఆరుబయటే ఆశా వర్కర్ల సమావేశం



ఆరుబయటే సమావేశంలో పాల్గొన్న ఆశా వర్కర్లు

ప్రజాశక్తి-కుందుర్పి

ఆశా వర్కర్లు గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆరుబయటే సమావేశ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ప్రత్యేకంగా ఒక భవనం లేకపోవడంతో ప్రతి నెలా సమావేవం నిర్వహించేందుకు నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిధులు మంజూరు చేసి ఆశా వర్కర్లకు ప్రత్యేకంగా ఒక సమావేశ భవనం నిర్మించాలని వారు కోరుతున్నారు. ఇదే విషయమై త్వరలోనే ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తరఫున అధికారులు వినతిపత్రం ఇవ్వాలని వారు కోరుతున్నారు.

బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత : ఎంఇఒ

ప్రజాశక్తి-కుందుర్పి

బాల్య వివాహాల నియంత్రణ సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంఇఒ తిప్పేస్వామి పిలుపునిచ్చారు. మండలంలోని వడ్డేపాల్యం గ్రామం ఉన్నత పాఠశాలలో గురువారం ఆర్‌డిటి, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆర్‌డిటి మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన 'బాల్య వివాహాలను అరికడదాం-ఆడ బిడ్డలను కాపాడుదాం' కార్యక్రమం నిర్వహించారు. ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థి దశలో వివాహం చేసుకోవడం వల్ల బాలికలకు ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు. కావున బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా పని చేసినప్పుడే బాల్య వివాహ వ్యవస్థను రూపు మాపవచ్చు అన్నారు. అలాగే సమాజంలో బాలల హక్కులను కాపాడాల్సిన భాద్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కంబదూరు ప్రాజెక్ట్ మహిళా శిశు అభివృద్ధి పథక అధికారిణి వనజ అక్కమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీలమ్మ, హెచ్‌ఎం సూర్యనారాయణ, ఉపాధ్యాయులు ఆదిశేషు, చలమారెడ్డి, వరలక్ష్మి, వైద్య సిబ్బంది నిత్య, శాంతి, హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ, అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తి : ఈవోఆర్‌డీ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల వ్యాప్తంగా గురువారం సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్త చేశామని ఈవోఆర్‌డీ దేవదాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల లోపు 90 శాతం పూర్తయిందని మిగిలిన 10 శాతం శుక్రవారం పూర్తి చేస్తామని తెలిపారు. పింఛన్ల పంపిణీలో కొద్ది వరకూ నెట్‌వర్క్ సమస్య వచ్చినా 11 గంటల నుంచి సజావుగా సాగిందని తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి

వ్యవసాయ సంయుక్త సంచాలకులు రవి

పొలంబడిపై అవగాహన కల్పిస్తున్న ఎడిఎ రవి, ఎఒ సోమశేఖర్

ప్రజాశక్తి-గార్లదిన్నె

పంటల సాగులో మెలకువలు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన పంటలను సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని అనంతపురం వ్యవసాయ సంయుక్త సంచాలకులు రవి సూచించారు. గురువారం మండల పరిధిలోని కోటంక గ్రామంలో రైతు లక్ష్మణ పొలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటను సాగు చేసినప్పుడు విత్తన శుద్ధి చేయాలన్నారు. పొలం చుట్టూ సరిహద్దు పంటలు సాగు చేయాలన్నారు. అంతర పంటలుగా కంది, అలసంద సాగు చేయాలన్నారు. అదేవిధంగా పంట సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, ఎఇఒ స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 6:1 మెజారిటీతో ఎస్సీ, ఎస్టీలను రాష్ట్రాలవారీగా ఉప-వర్గీకరణ చేయవచ్చని వెల్లడించడం సంతోషకరమన్నారు. సామాజిక సమానత్వ సూత్రాలు షెడ్యూల్డ్ కులాల్లో అత్యంత వెనుకబడిన తరగతులకు ప్రాధాన్యతనిచ్చే హక్కును రాష్ట్రానికి కల్పిస్తాయని పేర్కొందన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగల చిరకాల పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. ముఖ్యంగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో వర్గీకరణ సాధించటం చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. అంతేగాకుండా ఎస్సీ వర్గీకరణకు చంద్రబాబు ఎప్పుడూ సానుకూలంగానే వ్యవహరించారని గుర్తు చేశారు. సామాజిక న్యాయం పాటించేది ఒక్క టిడిపినే అని మరోసారి రుజువైందన్నారు. మాజీ సిఎం జగన్ మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశారు తప్ప ఏనాడూ వర్గీకరణపై మాట్లాడలేదని గుర్తుచేశారు. వర్గీకరణ కోసం దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న మాదిగలకు సుప్రీం తీర్పు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు

బలవంతపు రాజీనామాలు ఆపాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మధ్యాహ్నం భోజన కార్మికుల బలవంతపు రాజీనామాలు ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, ఉపాధ్యక్షులు ఏజ్ రాజమోహన్, వెంకటనారాయణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయా ఎంఇఒలు రాజీనామా లెటర్లు తయారు చేసి పాఠశాలలకు పంపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జిల్లాలో చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు, తొలగింపులు పరిపాటిగా మారాయన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 670 పాఠశాలల్లో 1300 మంది వర్కర్లను తొలగించి రోడ్డుపాలు చేశారని వాపోయారు. ఇందులో ఎక్కువ శాతం ఒంటరి మహిళలు ఉన్నారన్నారు. మహిళా సాధికారత కోసం కృషి చేస్తామని చెబుతూనే మహిళల్ని రోడ్డున పడేయడం ఎంత వరకూ సమంజమని ప్రశ్నించారు. వీరిని మారుస్తున్న ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలు నిర్వహిస్తున్న ఇస్కాన్, అక్షయ పాత్ర వారిని ఎందుకు మార్చడం లేదని నిలదీశారు. ఇప్పటికైనా మధ్యాహ్న భోజన కార్మికుల బలంతపు తొలగింపులను ఆపాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

రోటీ మేకర్ ప్రారంభం

అనంతపురం : అనంతపురం జయంతి ఇంజనీరింగ్ కళాశాల శిల్పా బాలికల హాస్టల్‌లో గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన రోటి మేకర్‌ను జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శన్‌రావు ప్రారంభించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆధునాతన టెక్నాలజీ ఉన్న రోటి మేకర్ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణక్రాంతి, హాస్టల్ మేనేజర్ బాల నర్సయ్య, డిప్యూటీ వార్డెన్ జ్యోజిరెడ్డి, సూపర్ ఇండెంట్ శివశంకర్‌గౌడ్, హాస్టల్ సిబ్బంది రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేరుశనగ పంట పరిశీలన

గుత్తి : మండలంలోని కరిడికొండ, బాచుపల్లి గ్రామాల్లో రైతులు సాగుచేసిన వేరుశనగ పంటను అనంతపురానికి చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ రమేష్‌నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు లేక బెట్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నాయన్నారు. ఈనేపథ్యంలో రైతులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పంటలు బెట్ట పరిస్థితులు తట్టుకునేందుకు పొటాషియం నైట్రేట్ ఎకరాకు లీటరు నీటిలో ఐదు గ్రాముల చొప్పున కలిపి పంటలపై పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఎఫ్‌లు సాయికల్యాణ్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన సాంబశివారెడ్డి

జగన్‌తో సాంబశివారెడ్డి

శింగనమల : తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని నియోజకవర్గ నేత ఆలూరు సాంబశివారెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తల సమస్యలను జగన్ అడిగి తెలుసుకున్నట్లు సాంబ శివారెడ్డి తెలిపారు.

పింఛన్ల పంపిణీ

పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని నడిమిదొడ్డి గ్రామంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతినెలా 1వతేదీనే 65 లక్షల మందికి వివిధ రకాల పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రతినెలా రూ.2,700కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. తాము చేపట్టిన సంక్షేమం, చేసే అభివృద్ధితో వైసిపి కనుమరుగు కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, జిల్లా నాయకులు వెంకట నరసానాయుడు, నాయకులు ఆకుల అరుణ, ఆకుల ఆంజనేయులు, రామ్మోహన్ నాయుడు (బాబు), ఆకుల విజయకుమార్ (బాబు), ప్రతాప్‌చౌదరి, ఆకుల అనిల్ ఆకుల తేజ, తిప్పన్న, వెంకటేశ్వరనాయుడు, నాగార్జున, ఇస్మాయిల్, మండల ప్రత్యేకాధికారి రామసుబ్బారెడ్డి, ఎంపిడిఒ రాముడు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

కాగా నార్పల మండలంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ 99.11శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపిడిఒ రాముడు తెలిపారు సచివాలయ ఉద్యోగులకు తోడుగా పింఛన్ పంపిణీలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

శింగనమల : మండల పరిధిలోని బండమీదపల్లి గ్రామంలో చేపట్టిన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మొదటి నెల నుంచి పెంచిన పింఛన్లు పంపిణీ చేసిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఆదినారాయణ, నాయకులు అమ్మలదిన్నె శాలిని, చితంబరి దొర, దేగల కృష్ణమూర్తి, చిదానందనాయుడు, మారుతీనాయుడు, రామాంజనేయులు, చిన్నరాయుడు, కాయల రమణయాదవ్ డిప్ ఓబులేష్, తదితరులు పాల్గొన్నారు

సిండికేట్‌నగర్‌లో పింఛన్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

బెలుగుప్ప : గురువారం సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేసినటుల డెవలప్‌మెంట్ అధికారి షేక్ షఫీ, ఎంపిడిఒ సుబ్బరాజు తెలిపారు. మండలంలోని 14 సచివాలయాల పరిధిలో 5,814 పింఛన్లు ఉండగా 5,551 మందికి పింఛన్లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి షేక్ షఫీ, ఎంపిడిఒ సుబ్బరాజు, విస్తరణాధికారి మాధవరెడ్డి, ఎపిఎం ఆంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ ఫయాజ్, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలవ్యాప్తంగా చేపట్టిన పింఛన్ల పంపిణీని ఎంపిడిఒ దస్తగిరి గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని వడ్డే కాలనీలో చేపట్టిన పింఛన్ల పంపిణీని పరిశీలించి సలహాలు, సూచనలు ఇచ్చారు. సాయంత్రం లోపు వందశాతం పూర్తి చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు.

ఆత్మకూరు : మండలవ్యాప్తంగా చేపట్టిన పింఛన్ల పంపిణీలో టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు పింఛన్ దారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు, నాయకులు సూర్యనారాయణ, ఓబుళపతి, అంకే ఆనంద్, చెన్నమ్మ, మురళి, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండల వ్యాప్తంగా గురువారం పింఛన్ల పంపిణీ కొనసాగింది. ఇందులో భాగంగా పామిడి పంచాయతీ పరిధిలోని మదీనా ఏరియా-1 సచివాలయ అధికారి నాగరాజు, టిడిపి సీనియర్ నాయకులు బొల్లు శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ఆదేశాల మేరకు స్థానిక సిండికేట్ నగర్ (ఆర్‌ఎన్‌ఆర్ కాలనీ)లో గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ (కుమ్మర శాలివాహన) సాధికార కమిటీ రాష్ట్ర డైరెక్టర్ కే.ఓబుళపతి, టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు బుల్లెట్ రఫీ, నాయకులు లోకేష్, కిట్టా, మహేష్, నారప్ప, జనార్దన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బెట్ట పరిస్థితులను అధిగమిద్దాం : శాస్త్రవేత్తలు

టెలీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న శాస్త్రవేత్తలు, రైతులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ప్రస్తుత వర్షాభావంతో నెలకొన్న బెట్ట పరిస్థితులను అధిగమిద్దామని శాస్త్రవేత్తలు పిలుపునిచ్చారు. మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పామిడి, గుత్తి మండల పత్తి రైతులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు బెట్ట పరిస్థితులపై వాపోయారు. అదేవిధంగా పచ్చదోమ తామర పురుగు, నల్లమచ్చ తెగులు ఉన్నాయని గజరాంపల్లి, కేశేపల్లి, ఖాదర్ పేట, జక్కలచెరువు గ్రామ రైతులు వివరించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ మల్లీశ్వరి సాదినేని, సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ బికె.కిషోర్‌రెడ్డి రైతుల సమస్యలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం పత్తిలో ఉన్న బెట్ట పరిస్థితులు అధిగమించడానికి రైతులందరూ 20 గ్రాముల యూరియా, 10 గ్రాముల డిఎపి, 10 గ్రాముల ఎంఒపి, మూడు గ్రాముల బోరాన్ మిశ్రమాన్ని కలిపి ఒక లీటర్ ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. అదేవిధంగా ప్రసంగించే పురుగుల బెడద నుంచి పంటను కాపాడేందుకు ఫ్లోనిక మైడ్ అనే మందును ఎకరాకు 60 గ్రాముల చొప్పున పిచికారీ చేస్తే 70 రోజుల వరకూ కాపాడవచ్చని శాస్త్రవేత్త కిషోర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, రిలయన్స్ ఫౌండేషన్ జోనల్ మేనేజర్ ప్రకాష్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో విద్యాకిట్లు పంపిణీ

పామిడి : మండలంలోని ఆదర్శ పాఠశాలలో విద్యారులకు విద్యాకిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు ఈశ్వర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి ఎన్‌డిఎ న్రపభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. అనంతరం మోడల్ స్కూల్ హాస్టల్‌లో పర్యటించి విద్యార్థుల సదుపాయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. తర్వాత ప్రభుత్వ టీసీ పాఠశాలకు చేరుకుని డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం అమలు గురించి ఆరాతీశారు. అనంతరం 1వ వార్డుకు చెందిన డీలర్ రాజు నూతన ప్రభుత్వ చౌక దుకాణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కత్రిమల ప్రభాకర్‌చౌదరి, సీనియర్ నాయకులు బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గౌస్, జింకల సంజీవకుమార్, దాసరి లక్ష్మీకాంతమ్మ, పాళ్యం నారాయణస్వామి, బొమ్మా మోహన్, కొట్టం మాలిక్, రంగస్వామియాదవ్, హమాలీ గోపాల్, శీన, బాలరాజు, రాజు, సుధీర్, కొండాపురం రవి, కొట్టాల ఓబులేసు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అరుణ పాల్గొన్నారు.

తాగునీరు అందించాలని వినతి

పంచాయతీ కార్యదర్శికి విన్నవిస్తున్న బిసి రోడ్డు కాలనీవాసులు

పామిడి : తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ స్థానిక విద్యుత్ కార్యాలయం దగ్గర ఉన్న బీసీ రోడ్డు కాలనీవాసులు కోరారు. ఈమేరకు గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ నెల రోజులుగా తాగునీరు అందడం లేదని వాపోయారు. ఎక్కువ మంది మోటార్లు వాడటం వల్లే కొళాయిలకు నీరు రావడంలేదని వాపోయారు. ఇందుకు పంచాయతీ సెక్రటరీ స్పందించి మాట్లాడుతూ ఉన్న రెండు మోటార్లలో ఒక మోటార్ ద్వారానే నీరు వచ్చేదని, రెండు మూడు రోజుల్లో రెండు మోటార్ల ద్వారా నీరు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఉచిత విద్య, వికాస శిక్షణ

వజ్రకరూరు : ఉరవకొండలోని లక్ష్మీనరసింహ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 4 నుంచి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు విద్య, వికాస శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు నిస్వార్థ ఫౌండేషన్ నిర్వాహకులు టి.వెంకట్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రం రోజూ ఉదయం 6 నుంచి 7 గంటలు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకూ పాఠశాల ప్రాంగణం, ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో కేంద్రం నిర్వహణ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కామ్రేడ్ కుల్లాయప్ప మృతికి నివాళి

శింగనమల : సిపిఐ సీనియర్ కార్యకర్త కామ్రేడ్ కుల్లాయప్ప మృతికి పలువురు సిపిఐ నాయకులు నివాళులర్పించారు. మండల పరిధిలోని కొరివిపల్లి గ్రామంలోని స్వగృహంలో కుల్లాయప్ప గురువారం మృతిచెందాడు. నివాళు లర్పించిన వారిలో సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు డి.చిన్నప్పయాదవ్, నాయకులు మధుయాదవ్, ఓబుళపతి, బయన్న, నారాయణమ్మ, తదితరులు ఉన్నారు.

బాలగంగాధర్ తిలక్ వర్ధంతి

గుత్తి : స్వాతంత్ర్య సమరయోధులు బాలగంగాధర్ తిలక్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం గుత్తిలోని పెన్షనర్ల భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జెన్నే కుల్లాయిబాబు, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు షేక్షావలి, నారాయణరెడ్డి, చెన్నారెడ్డి, నాగేశం, నారాయణ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

గుత్తికి చేరిన జీపుజాతా

జాతాలో పాల్గొన్న ఎఐఎస్‌ఎఫ్ నాయకులు

గుత్తి : విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా చేపట్టిన జీపుజాతా గురువారం సాయంత్రం గుత్తికి చేరుకుంది. జీపుజాతకు స్థానిక నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు గుత్తిలో బైకు ర్యాలీ నిర్వహించారు. తర్వాత ఆర్ఎస్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ప్రభుత్వ వసతిగృహాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికై మూడు రోజులు పాటు జీపుజాత నిర్వహించి కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు వెంకటరమణ నాయక్, చిన్నా, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

కుల్లాయిస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

కుల్లాయిస్వామి సన్నిధిలో ప్రార్థనలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

నార్పల : మండల పరిధిలోని గూగూడులో వెలసిన కుల్లాయిస్వామి, ఆంజనేయ స్వామిని మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, కార్యనిర్వహణాధికారి ఆమెకు స్వాగతం పలికారు. పూజలు చేసిన వారిలో సర్పంచి రమణకుమారి శివయ్య, మండల కో ఆప్షన్ సభ్యురాలు సబిరా, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు రస్తా ఏర్పాటు

బెలుగుప్ప : ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సోదరులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మండల కేంద్రంలోని శ్మశానికి రస్తా ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, నాయకులు పెద్ద తిప్పయ్య, తదితరులు శ్మశానికి దారి లేక ఎవరైనా చనిపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పయ్యావుల సోదరుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అప్పట్లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే శ్మశానికి దారి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోపు శ్మశాన వాటికకు దారి ఏర్పాటు చేశారు. దీంతో ఎమ్మెల్యే సోదరులకు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, ఉరవకొండ

O.S.NO:80/2017

Between:

బత్తల జయరాముడు (తండ్రి) వీరబద్రప్ప, వయస్సు 68 సం॥లు, హిందూ, వ్యవసాయం వల్ల జీవనం మోపిడి గ్రామం (పోస్టు) ఉరవకొండ మండలం, అనంతపురం జిల్లా. ...వాది

మరియు

బి.హనుమంతరెడ్డి తండ్రి లేట్ బిందెల కొండారెడ్డి, వయస్సు 60 సం॥లు, హిందూ, వ్యవసాయం, ధర్మపురి గ్రామం (పోస్టు), వజ్రకరూరు మండలం, అనంతపురం జిల్లా. ...ప్రతివాదులు

ప్రతివాదికి సమను

పై కేసులోని వాది ప్రాంసరినోటు బాకీ రాబట్టుటకు ప్రతివాది అయిన నీపై పై కోర్టు నందు దావా దాఖలు చేసి వున్నారు. సదరు దావాలో నీ హాజరు నిమిత్తం వాయిదా తేది:08/08/2024న ఉన్నది. సదరు తేదినాడు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ లేదా నీ వకీలు ద్వారా గానీ హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకో వచ్చును. ఆ దినం మీరు హాజరు కాని యెడల నీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వై.లక్ష్మీనారాయణ రెడ్డి,
వాదిపరంవకీలు,
ఉరవకొండ

Before the Hon'ble Permanent Lok Adalat for Public Utility Services, ANANTHAPURAMU, A.P.
Permanent Lok Adalat Case No.16/2024

Between :

The Ananthapuram Co-Operative Urban Bank Ltd.Rep.by Chief Executive Officer, D.No.10-446, Subhash Road, Ananthapuram Town- 515001. (A.P) ...Applicant

And

1) Sri. Kadiri Mahammad Nowshad
2) Sri. V.Balaji ...Respondents

Notice to Respondent No.1 & 2

R.1:Kadiri Mahammad Nowshad S/o K.M.Haneef, aged 36 yrs, Muslim, Hotel Business, D.No.6/12/12, Beside Andhra Bank, K.L.D Road, Ananthapuramu town-515001. Mobile: 9110310164.

R.2:V.Balaji S/o V.Venkatesulu, aged 48 yrs, Hindu, D.No.6-367, Azad Nagar, Ananthapuramu Dist-515003.

పై నెంబరు కేసులో 1వ మరియు 2వ రెస్పాండెంట్స్ అయిన మీ హాజరు నిమిత్తం మరియు సమాధానం వేయడానికి 23/08/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. కావున ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైనా ఆక్షేపణలు తెలుపుకొనవలెను.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

బి.సత్యనారాయణ రెడ్డి, న్యాయవాది,
అనంతపురం, సెల్:9849665596

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

వారోత్సవాల్లో వక్తలు

అనంతపురంలో తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-అనంతపురం అర్బన్

తల్లిపాలే బిడ్డకు అమృతం లాంటిది అనిసర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ పాల్ రవికుమార్, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం అనంతపురంలోని సర్వజన ఆసుపత్రి చిన్నపిల్లల విభాగం సమావేశ భవనంలో ఇన్‌ఛార్జి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత అధ్యక్షతన తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాన్పు అయిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు పట్టించాలన్నారు. దీనివల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఎలాంటి అంటూ వ్యాధులు రాకుండా తోడ్పడుతాయన్నారు. పుట్టినప్పటి నుంచి ఆరునెలలు పాటు తల్లి పాలే తాగించాలన్నారు. ఆరు నెలల తర్వాత రెండేళ్ల తల్లిపాలతోపాటు అనుబంధ ఆహారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల విభాగం అధికారి డాక్టర్ రవికుమార్, గైనకాలజీ విభాగం అధికారిణి డాక్టర్ శంషాద్‌బేగం, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ యుగంధర్, ఆర్‌ఎంఒ డాక్టర్ పద్మజ, పిపి యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుష్పలత, ఇన్‌ఛార్జి డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధనా అధికారి గంగాధర్, చిన్నపిల్లల విభాగం డాక్టర్లు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : తల్లి ముర్రుపాలే బిడ్డకు అమృతమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు నారాయణమ్మ, రామలక్ష్మి సూచించారు. గురువారం మండల కేంద్రంతోపాటు ముచ్చుకోట గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు పట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అంజనమ్మ సూచించారు. మండల పరిధిలోని 67 అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పుడే ముర్రుపాలు పట్టిస్తే ఎలాంటి రోగాలు బిడ్డ దరి చేరవన్నారు. ఈ కార్యక్రమంలో డాకర్లు రమేష్, బాలాజీనాయక్, అంగన్వాడీలు, ఆయాలు, ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, చిన్నపిల్లల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : పట్టణంలోని 8, 10వ అంగన్వాడీ సెంటర్లలో గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిడిపిఒ నాగమణి, సూపర్‌వైజర్ రామలక్ష్మి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ఆరు నెలలపాటు తల్లిపాలు మాత్రమే పట్టించాలన్నారు. పోత పాలు ఇవ్వరాదన్నారు. ముఖ్యంగా అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, తల్లులు, అంగన్వాడీ టీచర్లు జయంతి, సేకున్‌బీ, హెల్పర్లు మాబున్నీ, కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, యర్రగుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మండల వైద్యాధికారిని డాక్టర్ గౌతమి ఆధ్వర్యంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ర్యాలీ, అవగాహన సదస్సులు నిర్వహించి తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తారణాధికారి నాగేశ్వరయ్య, సిహెచ్ఒ లోకనాథ్, అరుణ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా గురువారం పట్టణంలో ఆర్‌డిటి సంస్థ ఆధ్వర్యం లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్‌డిటి ఆసుపత్రి నుంచి వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు ఫెక్సీ చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని నినాదాలతో హోరెత్తించారు. ప్రాథమిక దశ నుంచి ప్రతి బిడ్డకు తల్లులు ముర్రుపాలు తాపి సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆ దిశగా గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు అంగన్వాడీ సిబ్బంది, వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షులు చల్లా కిషోర్ చౌదరి మాట్లాడుతూ ముర్రుపాలు, తల్లిపాల ప్రయోజనాలపై ఆరోగ్య సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని తెలిపారు.

తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పామిడి, గార్లదిన్నె మండలాల్లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, అంగన్వాడీలు

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని ఆత్మహత్య

రాయదుర్గం : పట్టణంలోని లక్ష్మీబజార్ సిండికేట్ బ్యాంక్ సమీపంలో నివసిస్తున్న ఉడిపి వీరన్న (56) గురువారం తన నివాసంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వీరన్న గతంలో హోటల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కుటుంబ, ఆస్తి తగాదాలు, తదితర సమస్యల కారణంగా మనస్థాపానికి గురై ఉదయం ఇంట్లో భార్య ఉండగానే బయట తలుపు గడియ పెట్టి వరండాలో తాడుతో ఉరి వేసుకొన్నాడు. వీరన్నకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్

శింగనమల : మండల పరిధిలోని తరిమెల సమీపంలో ఉన్న పెన్నానది శివారుల్లో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పెన్నానది సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసిన నలుగురిని అరెస్టు చేసి రూ.18370 నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కుక్కల దాడిలో 30 గొర్రె పిల్లలు మృతి

గాయపడిన పిల్లలకు వైద్యం చేస్తున్న దృశ్యం

బెలుగుప్ప : కుక్కలు దాడి చేయడంతో మండల పరిధిలోని కోనాపురం గ్రామానికి చెందిన కురుబ శ్రీరాములుకు చెందిన 30 గొర్రె పిల్లలు కుక్కలు మృతిచెందాయి. ఇంకా కొన్ని గొర్రె పిల్లలు గాయపడ్డాయి. ఈ సందర్భంగా గొర్రెల కాపరి కురుబ శ్రీరాములు మాట్లాడుతూ గొర్రెలను పెంచుకుంటూ జీవనం సాగించే తాను గొర్రె పిల్లల కోసం కళ్లం దొడ్డిలో ఏర్పాటు చేశానన్నారు. ఈనేపథ్యంలో గొర్రె పిల్లల మందపై కుక్కలు దాడి చేయడంతో 30 గొర్రె పిల్లలు మృతి చెందాయని వాపోయాడు. మిగిలిన గొర్రె పిల్లలు తీవ్రంగా గాయపడ్డాయన్నారు. దీంతో దాదాపు రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లిందని వాపోయాడు. సమాచారం అందుకున్న వైద్యాధికారి ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన పిల్లలకు వైద్యం చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్ పశు సంవర్తక సహాయకులు సుదర్శన, పశువైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.